# బండి ఫోన్ ట్యాపింగ్ వ్యాఖ్యలు
# వెనక్కి తీసుకోవాలి

- 48 గంటల్లోగా క్షమాపణ చెప్పకపోతే కోర్టు లోకి లాగుతా
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**శెనార్తి మీడియా, హైదరాబాద్:**

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై బండి సంజయ్ చేసిన "అడ్డగోలు, చిల్లర వ్యాఖ్యలు" వెంటనే వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు లీగల్ నోటీసు పంపనున్నట్లు వెల్లడించారు."48 గంటల్లో క్షమాపణ చెప్పకపోతే కోర్టులోకి లాగుతాను" అని కేటీఆర్ హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్‌పై బండి సంజయ్ ఆరోపణల్లో ఒక్క శాతం నిజం ఉందని నిరూపించాలని సవాల్ విసిరారు.కేటీఆర్ మాట్లాడుతూ, "కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్‌కు నిఘా వ్యవస్థ ఎలా పనిచేస్తుందో కనీస అవగాహన లేదు. నిర్వాహనంపై పరిజ్ఞానం లేకుండా అబద్ధాలు, అనుచిత వ్యాఖ్యలు చేసి అన్ని హద్దులు దాటారు. చిల్లర, బజారు మాటలు మాట్లాడడం ఆయన అలవాటుగా మారింది. ప్రతి సారి మరింత దిగజారి మాట్లాడుతున్నారు" అని విమర్శించారు."కేంద్ర మంత్రిగా బాధ్యతగా వ్యవహరించడం ఢిల్లీ బాసుల చెప్పులు మూసినంత ఈజీ కాదని ఇప్పటికైనా తెలుసుకోవాలి. రాజకీయ ప్రాధాన్యత దక్కకపోవడంతో వార్తల్లో నిలవాలని చౌకబారు వీధి నాటకాలకు తెరలేపుతున్నారు" అని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

# అప్రమత్తంగా ఉండాలి

- భారీవర్షా లపై ఉన్నతాధికారులతో సమీక్ష
- మూసీ, ఈదుల వాగు ఉద్ధృతంగా ప్రవాహం
- స్థానికుల చాకచక్యంతో ఏడుగురికి తప్పిన ప్రాణాపాయం



**శెనార్తి మీడియా, హైదరాబాద్**

హైదరాబాద్ నగరంలో భారీవర్షాల వల్ల తలెత్తుతున్న ఇబ్బందులు, వరద సమస్యలపై శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడా ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు తక్షణ సహాయం అందించే విధంగా సంబంధిత శాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమీక్ష సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సెక్రటరీ ఇలంబర్తి, సీఎం సెక్రటరీ మాణిక్‌రాజ్, ఈవీ నర్సింహా రెడ్డి, జేఎండీ పి. గౌతమి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

**మూసీ ఉద్ధృతి – రాకపోకలకు అడ్డంకులు**

గురువారం సాయంత్రం కురిసిన భారీవర్షంతో యాదాద్రి భువనగిరి జిల్లాలో మూసీ నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. వలిగొండ మండలం సంగెం శివారులో భీమలింగం వద్ద లోలెవెల్ వంతెనపైగా వరద నీరు ప్రవహించడంతో, రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. బారికేడ్లు ఏర్పాటు చేయడంతో సంగెం పరిసర గ్రామాలకు రవాణా పూర్తిగా ఆగిపోయింది. బీబీనగర్ మండలం రుద్రవెల్లి, చౌటుప్పల్ మండలాల్లో వాగులు పొంగిప్రవహిస్తున్నాయి. చౌటుప్పల్‌లో ఈదుల వాగు మీదుగా వెళ్తున్న కారు వరదలో కొట్టుకుపోయింది. తాడు వేసి స్థానికులు ఏడుగురిని సురక్షితంగా బయటకు తీశారు. వారి చాకచక్యంతో పెను ప్రమాదం తప్పింది.

**రిజర్వాయర్ల నీటి మట్టం పెరుగుదల**

హిమాయత్‌సాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకోవడంతో నాలుగు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. దీంతో మూసీ ప్రవాహం మరింత పెరగడంతో పరీవాహక ప్రాంతాల ప్రజలకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. హుస్సేన్‌సాగర్ కూడా పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంది

## మహిళలకు సీఎం రేవంత్ రాఖీ శుభాకాంక్షలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని మహిళలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని అన్నారు. మహిళల సాధికారతతో పాటు– మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు, పథకాలు అమలు చేస్తోందని అన్నారు. గృహజ్యోతి, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరా క్యాంటీన్లు,ఇందిరమ్మ ఇళ్ల మంజూరులోనూ మహిళలకే పెద్దపీట వేయడం జరిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో మహిళలందరూ భాగస్వాములయ్యే వరకు ప్రజా ప్రభుత్వం వారికి అండగా ఉంటుందన్నారు. మహిళల రక్షణ, భద్రత విషయంలో ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతుందని, మహిళల అభివృద్ధి, సంక్షేమం విషయంలో ఎక్కడా రాజీ పడేది లేదని అన్నారు. అక్కా చెల్లెళ్లందరికీ తమ ప్రభుత్వం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని, అందరి దీవెనలతో విజయవంతంగా ప్రజా పాలన సాగిస్తుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.

# ఆదాయపు పన్ను చట్టంపై పునరాలోచన

## పూర్తి అధ్యయనం తరవాత ప్రవేశ పెట్టే యోచన




**న్యూఢిల్లీ,ఆగస్ట్8 :**

ఆరు దశాబ్దాలుగా అమల్లో ఉన్న ఆదాయపు పన్ను చట్టం–1961 స్థానంలో కొత్త చట్టం తీసుకొచ్చేందుకు సిద్ధమైన కేంద్రం ఆదాయపు పన్ను నూతన బిల్లు 2025ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. అయితే, ఈ బిల్లును తాజాగా కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకున్నట్లు తెలుస్తోంది. దీన్ని అప్‌డేట్ చేసి మళ్లీ పార్లమెంట్ లో ప్రవేశపెట్టాలని నిర్ణయించిన సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడిరచాయి. ఈ నూతన ఆదాయపు పన్ను బిల్లును ఈ ఏడాది ఫిబ్రవరి 13న కేంద్రం లోక్‌సభ లో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. దీనిపై విపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ఈ బిల్లును సెలెక్ట్ కమిటీ–కి పంపించారు. ఈ కమిటీ– దీన్ని అధ్యయనం చేసి జులై 21న తమ నివేదికను పార్లమెంట్‌కు సమర్పించింది. మొత్తం 4500 పేజీలతో కూడిన ఈ నివేదికలో ముసాయిదా బిల్లుకు 285 ప్రతిపాదనలు చేసింది. ఈ ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకున్న కేంద్రం.. దానికి అనుగుణంగా కొత్త బిల్లును రూపొందించేందుకు సిద్ధమైంది. ఈ అప్‌డేటెడ్ బిల్లును ఆగస్టు 11న లోక్‌సభ ముందుకు తీసుకురావాలని కేంద్రం నిర్ణయించినట్లు– సమాచారం. నూతన ఆదాయపు పన్ను బిల్లుకు సెలెక్ట్ కమిటీ– కొన్ని ప్రధాన సూచనలు చేసింది. ముఖ్యంగా ఇంటిపై ఆదాయం పొందుతున్న వారికి ఉపశమనం కలిగేలా కొన్ని ప్రతిపాదనలు సూచించినట్లు– తెలుస్తోంది. ప్రస్తుతం గృహ రుణ వడ్డీతో పన్ను మినహాయింపు ప్రయోజనాలు కేవలం సొంతింట్లో ఉంటున్న వారికి మాత్రమే వర్తిస్తున్నాయి. అలా కాకుండా సొంతింటిని అద్దెకు ఇచ్చిన సందర్భాల్లోనూ వడ్డీతో పన్ను మినహాయింపు కల్పించాలని కమిటీ– సూచించినట్లు సమాచారం. ఇక, టీడీఎస్, టీసీఎస్ రీఫండ్లను కూడా సరళతరం చేయాలని కమిటీ– ప్రతిపాదనలు చేసింది. 1961లో రూపొందించిన ఆదాయపు పన్ను చట్టానికి, 66 బడ్జెట్‌లలో (రెండు మధ్యంతర బడ్జెట్లు– కలిపి) ఎన్నో సవరణలు జరిగాయి. దీంతో సంక్లిష్టంగా తయారైంది. పన్ను చెల్లింపుదార్లకు వ్యయాలూ పెరిగాయి. దీంతో ఈ చట్టాన్ని సమీక్షించి, సరళతరం చేస్తామని 2024 జులై బడ్జెట్‌లో ప్రభుత్వం పేర్కొంది. ఆ మేరకు కొత్త బిల్లును రూపొందించారు.

# గోదావరిఖని – కన్నాల రైల్వే గేట్ వద్ద అండర్‌పాస్, ఫ్లైఓవర్‌కు రైల్వే శాఖ ఆమోదం

- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ చొరవ
- రవాణా ఇబ్బందులకు పరిష్కారం




VAMSI KRISHNA GADDAM
MEMBER OF PARLIAMENT
LOK SABHA

To
Shri Arun Kumar Jain
The General Manager
South Central Railway
Rail Nilayam, Secunderabad - 500003.

Subject: Request for Construction of an Underpass or Flyover at Gate Number 46-E/A Connecting Godavarikhani to Kannala Village and Surrounding villages Areas

Respected Sir,

Yours sincerely,
Vamsi Krishna Gaddam

Member of Consultative Committee for the Ministry of Heavy Industries
Member of Standing Committee - Science and Technology
33, Ferozeshah Road, New Delhi - 110001

**శెనార్తి మీడియా, గోదావరిఖని:**

గోదావరిఖని – కన్నాల గ్రామాలను కలిపే రైల్వే గేట్ నంబర్ 46–E/A వద్ద ప్రజలు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులపై పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ చొరవకు రైల్వే శాఖ నుండి ఆమోదం లభించింది. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ తెలిపిన ప్రకారం, 2020–21లోనే రైల్వే బోర్డు ఈ ప్రాజెక్టుకు అనుమతి ఇచ్చింది. మొదట రాష్ట్ర ప్రభుత్వంతో వ్యయం పంచుకునే విధానంలో ఆమోదం పొందినా, 2023 మార్చి 25న రాష్ట్ర ప్రభుత్వం వాటా భాగస్వామ్యం చేయబోమని తెలపడంతో, 100 శాతం రైల్వే నిధులతో నిర్మించాలని నిర్ణయించారు. ప్రస్తుతం టెండర్ దశలో ఉన్న ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం ₹86.12 కోట్లు. ఈ ఏడాది మే 6న స్పెషల్ ప్రాజెక్టుగా ప్రకటించిన రైల్వే శాఖ, 2028–29 నాటికి పనులు పూర్తిచేస్తామని ప్రకటించింది. ఆర్వోబీ పూర్తయితే 100కు పైగా గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. అత్యవసర సేవలకు ఆటంకం లేకుండా ప్రయోజనం చేకూరుతుంది. విద్యార్థులు, వ్యాపారవేత్తలు, ఉద్యోగులకు ఇది పెద్ద ఊరటగా మారనుంది. ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ, "ఈ ఆర్వోబీ పట్ల రైల్వే శాఖ స్పందన సంతోషకరం. ఇది స్థానిక ప్రజలకు మేలు కలిగించనుంది. పనులు వేగంగా పూర్తవాలని కోరుతున్నాను" అని అన్నారు.

## కూనంనేని ఎన్నికపై పిటిషన్ తిరస్కరణ

**న్యూఢిల్లీ,ఆగస్ట్8 :** కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఎన్నికను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. గతంలోనే కూనంనేని ఎన్నికపై దాఖలైన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ జలగం వెంకట్రావు సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు. కాగా.. అడ్మిషన్ స్థాయిలోనే ఈ పిటిషన్‌ను ద్విసభ్య ధర్మాసనం డిస్మిస్ చేసింది.

# ఉజ్వల్ యోజనకు సబ్సిడీ కొనసాగింపు

- చమురు కంపనీలకు 30 వేల కోట్ల సబ్సిడీ చెల్లింపు
- కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ,ఆగస్ట్8 :**

ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది.ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపనీలకుకు 30 వేల కోట్ల సబ్సిడీని కేంద్ర కేబినెట్ ఆమోదించింది. దేశీయ ఎల్ పీజీ అమ్మకాలపై కంపెనీలకు కలిగే నష్టాలను భర్తీ చేయడానికి ఈ సబ్సిడీని ఉద్దేశించారు. దీనిని 12 భాగాలుగా చెల్లిస్తారు. 2025–26 ఆర్థికసంవత్సరానికి ప్రధాన మంత్రి ఉజ్వల యోజన వినియోగదారులకు రూ. 12 వేల సబ్సీడీని కొనసాగించడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. భారతదేశం అంతటా శుభ్రమైన వంట గ్యాస్ నిరంతరం వినియోగించుకునేలా ప్రోత్సహించడం ద్వారా లబ్దిదారులకు ఎల్ పిజి కనెక్షన్లు మరింత చౌకగా అందించడమే ఈ సబ్సిడీ లక్ష్యం.మూడు ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలకు సబ్సిడీలను అందించనున్నట్లు– పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వశాఖ తెలిపింది.ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసిఎల్) భారత పెట్రోలియం కార్పొరేషన్ (బిపిసిఎల్) హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ ( హెచ్ పిసిఎల్) మధ్య పంపిణీ చేస్తుంది. అంతర్జాతీయంగా చమురు ధరల్లో మార్పుల నుంచి వినియోగదారులకు రక్షణ కల్పిండడం, ప్రభుత్వ రంగ చమురు కంపెనీలకు మద్దతు ఇవ్వడం ఈ నిర్ణయం లక్ష్యం అని కేబినెట్ సమావేశం అనంతరం కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడిరచారు. చమురు, గ్యాస్ రంగాల్లో అనిశ్చితి కారణంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు– తెలిపారు.మధ్యతరగతికి వంటగ్యాస్ అందుబాటులో ఉండేలా చూడడం కోసం, రూ.30 వేల కోట్ల సబ్సిడీ ఆమోదించినట్లు– తెలిపారు అశ్విని వైష్ణవ్ .ప్రధాన్ మంత్రి ఉజ్వల్ యోజన (పిఎంయువై) 2016 మే లో ప్రారంభమైంది. భారతదేశం అంతటా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు, వయోజన మహిళలకు డిపాజిట్ లు లేకుండా ఎల్ పిజి కనెక్షన్లు ఇవ్వడం లక్ష్యంగా సాగుతోంది. 2025 జులై 1 నాటికి దేశవ్యాప్తంగా 10కోట్ల 33 లక్షల ఎంఎంయువై కనెక్షన్లు పంపిణీ చేశారు. ఉజ్వల యోజన సబ్సిడీ కొనసాగించడం వల్ల వినియోగదారుడు ఎటు–వంటి డిపాజిట్ లేకుండానే ఎల్ పిజి కనెక్షన్ అందుకుంటాడు.అంతేకాదు, సిలెండర్, ప్రెషర్ రెగ్యులేటర్, సేఫ్టీ హోస్, డమొస్టిక్ గ్యాస్ కన్స్యూమర్ కార్డు బుక్ లెట్ అందించడంతో పాటు– ఇన్‌స్టలేషన్ చార్జీలకోసం సెక్యూరిటీ– డిపాజిట్ ను కవర్ చేస్తుంది. ఉజ్వల 2.0 పథకం కింద వినియోగదారుడు తన మొదటి స్టవ్, రీఫిల్ కూడా ఉచితంగా పొందుతారు. అంతర్జాతీయ ఎల్ పిజి ధరల అస్థిరత నుంచి ఉజ్వల్ యోజన వినియోగదారులను కాపాడేందుకు, క్రమబద్దీకరించి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 2022 మేలో లక్ష సబ్సిడీని ప్రవేశపెట్టింది. సంవత్సరానికి 12 రీఫిల్ లకు 14.2 కిలోల సిలెండన్ ను కేవలం 200 రూపాయలకే అందిస్తుంది. ఈ సబ్సిడీని 2023 అక్టోబర్ లో రూ.300 కు పెంచారు .ఉజ్వల యోజన లబ్దిదారులలో ఎల్ పిజి సగటు– తలసరి వినియోగం (పిసిసి) క్రమంగా పెరిగింది. 2019–20లో మూడు రీఫిళ్లనుంచి 2022.23లో సగటు– వినియోగం 3.68 కి పెరిగింది. 2024–25లో సుమారు 4.47 రీఫిల్ లకు చేరింది. ఇది వంటగ్యాస్ వినియోగంలో మహిళలు చూపుతున్న శ్రద్ధను ప్రతిబింబిస్తోంది.

# గల్ఫ్‌లో 45 వేల మంది తెలంగాణ కార్మికులు

- వారి భద్రతకు ప్రత్యేక విభాగాలు.. లోక్‌సభలో కేంద్రం వెల్లడి



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 8 :**

గల్ఫ్ దేశాల్లో 45 వేలకు పైగా తెలంగాణ కార్మికులు ఉన్నారని కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ తెలిపారు. విదేశాల్లోని వలస కార్మికుల సమస్యల పరిష్కారానికి, వారి భద్రతకు కేంద్రం అన్ని చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. శుక్రవారం లోక్‌సభలో ఎంపీ ఆర్ రఘురాం రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన లిఖిత పూర్వకంగా ఈ మేరకు సమాధానం ఇచ్చారు. గల్ఫ్ సహా అన్ని దేశాల్లోని భారతీయ రాయబార కార్యాలయాలు తెలంగాణ కార్మికుల రక్షణ కోసం పనిచేస్తున్నాయని మంత్రి వెల్లడించారు. అత్యవసర సమయాల్లో సంప్రదించడానికి ఈ మెయిల్, ఫోన్ నంబర్లు, వాట్సాప్, సోషల్ మీడియా వంటి మార్గాలున్నాయని, తక్షణ స్పందన కోసం ప్రత్యేక విభాగాలూ పనిచేస్తున్నాయని తెలిపారు. కాగా, 2024–25లో తెలంగాణకు కేంద్రప్రభుత్వం పలు పథకాల కింద నిధులు కేటాయించింది. నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)కింద రూ. 67.16 కోట్లు, ప్రధాన్ మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద రూ.208.82 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ లోక్‌సభలో తెలిపారు. శుక్రవారం ఎంపీ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు.

# భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

**శెనార్తి మీడియా, కరీంనగర్:**

మహిళలు భక్తిశ్రద్ధలతో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు, పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తుల దైవ సందర్శనతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి. వరలక్ష్మీ వ్రతాలు, కుంకుమార్చనలు, అమ్మవారి నామస్మరణలు, దీపకాంతులతో ప్రతీ గృహం కళకళలాడింది. మహిళలు, యువతులను ఇంటికి ఆహ్వానించి మహాలక్ష్మి స్వరూపంగా భావిస్తూ పరసర్పం పసుపు కుంకుమలు, పప్పు బెల్లాలు, ఫలతాంబూలాలు, వాయినాలుగా ఇచ్చుకుని ఆశీస్సులు పొందారు. ఆలయాల్లో అర్చనలు జరిపి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చైతన్యపురి మహాశక్తి ఆలయం మహిళలతో పోటెత్తింది. ఉదయం మహాహారతి, సాయంత్రం వరలక్ష్మీ వ్రతం, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతంలో కేంద్ర హోంశాఖా సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పాల్గొని అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. యజ్ఞవరాహక్షేత్రంలో మహాలక్ష్మి అమ్మవారికి అభిషేకం, పూలంగిసేవ, వరాహస్వామి మూలమంత్ర హవనం, మహాభిషేకం, వరలక్ష్మి వ్రతం జరిగింది. సాయంత్రం సహస్రనామార్చన, ఊంజల్‌సేవ, కుంకుమార్చనలు జరిగాయి. జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత ఆలయంలో ఒడిబియ్యం, గాజులు, పసుపుకుంకుమలు, చీరలు సమర్పించారు. వావిలాలపల్లి శ్రీహనుమత్ సహిత కనక దుర్గ ఆలయంలో శ్రీచక్రార్చన, కుంకుమార్చన జరిగింది. భగత్‌నగర్ అయ్యప్ప ఆలయంలో కుంకుమార్చనలు జరిగాయి. అశోక్‌నగర్ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. కమాన్ రోడ్ రామేశ్వరాలయంలో కుంకుమార్చనలు, పర్వతవర్ధినీ అమ్మవారికి విశేషాలంకారం చేశారు.